

కస్తూర్బాల్లో కష్టాలు



2



2

కిక్కిరిసిన మీసేవ సెంటర్లు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## నీల కంఠేశ్వరాలయంలో హుండీ లెక్కింపు



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని నీల కంఠేశ్వరాలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. రూ.3,25,511ల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీరామ్ రవీందర్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సిరిగిరి తిరుపతి, ఆలయ అభివృద్ధి కమిటీ మెంబర్లు నందకిషోర్, నర్సింగ్ రావు, ఆలయ అర్చక సిబ్బంది అలాగే నగర మహిళ భక్తులు పాల్గొన్నారు.





## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు

**అక్షరటుడే, భీమ్‌గల్:** పంచాయతీ ఎన్నికల్లో ప్రజల మద్దతు కాంగ్రెస్ నాయకులకే ఉందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ మద్దతు దారులకే ఆదరణ లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు దొరకకపోవడంతో అసహనంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్‌పై అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏ రోజు కూడా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణాలకు వడ్డీ మాఫీ చేయలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ భీమ్‌గల్ నగర అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేశ్, గోపాల్ నాయక్, అన్వేష్, మహేష్, దొంకంటి రాజేష్, నాగభూషణం, శ్యామ్ రాజ్, సాయిబాబా, నవీన్, పల్లికొండ అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## దేవితండా సేవాలాల్ బ్రహ్మోత్సవాలు

**అక్షరటుడే, ఇందల్వాయి :** మండల కేంద్రంలోని దేవిఘడ్ దేవితండా సేవాలాల్ ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా చండీయాగం, యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు శుక్రవారం టీఎస్ ఆర్టీసీ మాజీ ఛైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం.. ఆయనను దేవితండా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎంపీపీ రమేశ్ నాయక్, మందిరం పూజారి దేగావత్ శివరాం రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి దాస్, మాజీ జడ్పీటీసీ గోపాల్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రకాశ్, సీనియర్ నాయకులు పాశం కుమార్, రఘు పాల్గొన్నారు.



## దేశభక్తిని నింపిన గేయం వందేమాతరం

**అక్షరటుడే, ఇందూరు :** స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర గేయం కోట్లాదిమంది భారతీయుల్లో దేశభక్తిని నింపిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం కంఠేశ్వర్‌లోని వివేకానంద పాఠశాలలో సామూహిక గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంకించంద్ర చటర్జీ జ్ఞాపకార్థం యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. వందేమాతర గేయం స్ఫూర్తితో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమం కొనసాగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సాయి రెడ్డి, బీజేపీ నాయకులు ఆనంద్ రావు, సాయి ప్రవీణ్, మఠం పవన్, బాబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## మంచుకురిసే వేళలో..

ఈ చిత్రాన్ని చూసి ఏ కశ్మీరు లోయనో.. అరుకు లోయనో అనుకుంటే మీరు పొరపడినట్లే.. నిజామాబాద్ నగర శివారులో శుక్రవారం ఉదయం కనిపించిన దృశ్యమిది. తెల్లవారుజామున మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం ఎనిమిది గంటలైనా చుట్టు పక్కల ప్రాంతాలు కనిపించనంతంగా పొగ మంచు పరుచుకుంది. చలి తక్కువగా ఉన్నా మంచు అధికంగా కురుస్తుండడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

– అక్షరటుడే, ఇందూరు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం తొలివిడత నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో పలు గ్రామాల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్‌తో పాటు పాలకవర్గాలను ఏకాభిప్రాయంతో ఎన్నుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. అభ్యర్థులు సైతం ఏకగ్రీవం అయితే ఎన్నికల ఖర్చు తగ్గుతుందని భావిస్తున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి




# ఏకగ్రీవాలపై ఫోకస్

- పంచాయతీ ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో ఎన్నికకు ప్రయత్నాలు
- పలు గ్రామాల్లో కొనసాగుతున్న బేరసారాలు
- ఎలక్షన్ ఖర్చు కంటే ఇదే బెటర్ అనే భావనలో అభ్యర్థులు

కామారెడ్డి జిల్లాలో 532 గ్రామ పంచాయతీలు ఉండగా మొదటి విడతలో 167 గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి గ్రామాల్లో సందడి నెలకొంది. ఒక్కొక్క గ్రామంలో దాదాపు పది మంది వరకు సర్పంచులుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దాంతో ఎవరికి ఓటు వేయాలో ప్రజల్లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామ అభివృద్ధిపై చర్చ కొనసాగుతుంది. ఎన్నికల్లో గెలిచినా ప్రజలను పట్టించుకుంటారా అనే అనుమానాలు అనేక మందిలో ఉన్నాయి. దీంతో ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామానికి ఏం ఇస్తావని ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థులు సైతం ఎన్నికల ఖర్చు కంటే గ్రామానికి ఎంతో కొంత ఇచ్చి ఏకగ్రీవం చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. సర్పంచ్ పదవికి బేరసారాలు కొనసాగిస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రేటు నిర్ణయిస్తున్నారు.

### ఖర్చు కంటే ఇదే బెటర్

గ్రామ సర్పంచ్‌గా పోటీలో నిలబడితే రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు అవుతోందని ప్రచారం జరుగుతోంది. ఓటుకు ఇంత అని లెక్క వేసుకున్నా ఖర్చు అత్యధికంగా వస్తోంది. అంతంత ఖర్చు చేసే కంటే ప్రజల అభిప్రాయం మేరకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకైనా గ్రామానికి ఇవ్వడానికి పలువురు సిద్ధమవుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలలో ఈ రేటు రూ.50 లక్షల వరకు కూడా ఉన్నట్టుగా టాక్ వినిపిస్తోంది.

### బాండ్ పేపర్ రాసుకునే యోచన

గెలిచాక పనుల కోసం వెళ్తే ఏకగ్రీవం కోసం డబ్బులిచ్చాను కదా అని సర్పంచులు మాట్లాడతా రేమోనని ప్రజలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవానికి సంబంధం లేకుండా గెలిచాక వాటి ఊసెత్తకుండా ఉండేందుకు బాండ్ పేపర్ రాసివ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. బాండ్ పేపర్ రాసుకోవడంతో భవిష్యత్తులో సర్పంచుల నుంచి ఫలానా పని నేనెందుకు చేయాలి అని మాట్లాడకుండా ముందే కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు. కాగా గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వాలు నజరానా ప్రకటించేవి. అయితే గత ఎన్నికల్లో ఏకగ్రీవం అయిన జీపీలకు అదనంగా ఎలాంటి నిధులు రాలేదు. అయినా కానీ పలు గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే లింగంపేట మండలంలోని ఓ తండాలో సర్పంచ్ ఏకగ్రీవం కాగా కామారెడ్డి మండలంలోని ఓ తండాలో ఏకగ్రీవం కావడానికి ఫైనల్ స్టేజిలో ఉన్నట్టుగా తెలుస్తోంది. మరికొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం కోసం గ్రామస్తులంతా సన్నాహాలు చేస్తున్నట్టుగా సమాచారం.

## ర్యాలీలకు అనుమతి తప్పనిసరి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ర్యాలీలు, సభలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థానిక రిటర్నింగ్ అధికారి, పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి రాజకీయ పార్టీ, అభ్యర్థులు, నిర్వాహకులు నియమాలను పాటించాలన్నారు. పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

## భగలాముఖి అమ్మవారి మాస జన్మదిన అష్టమి పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భగలాముఖి అమ్మవారి మాస జన్మదిన అష్టమిని శుక్రవారం నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని భగలాముఖి అమ్మవారికి విశేష పూజలు చేశారు. గణపతి పూజతో పాటు గోత్రనామాలతో విశేష సంకల్పం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు చేశారు. అలాగే భక్తులు దేవీ దేవతల నామ పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్ర సమర్పణతో పాటు వివిధ రకాల ఫలాలు, స్వీట్లతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పీఠాధిపతి క్రాంతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. రామారెడ్డి మండలం మొండి వీరన్న తండాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వరి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తేమ శాతాన్ని ప్రభుత్వ సాధారణ ప్రమాణాలకు అనుగుణంగా చూడాలన్నారు. తూకం, నాణ్యత పరీక్షల్లో పూర్తి పారదర్శకత పాటించాలని కేంద్రం సిబ్బందికి సూచించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో బరువులు, తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో సురేందర్, సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్, తహశీల్దార్ ఉమలత, రైతులు, తదితరులున్నారు.

## రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలి: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద, బైపాస్ రోడ్డు మార్గంలో, డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై పనులను శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో చేపట్టేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. నిజామాబాద్ నగరంలో గోల్ హనుమాన్ నుంచి పూసలగల్లీకి వెళ్లేమార్గంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న ప్రాంతాలను సైతం కలెక్టర్ పరిశీలించారు. పనులను ప్రారంభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాను మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేయడంతో పాటు పనుల ప్రగతిని సమీక్షిస్తానన్నారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ అధికారి ప్రవీణ్, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్ర సాగర్, ఇనాయత్ తదితరులున్నారు.




## రైల్‌రోకో చేపట్టిన కవిత.. అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కామారెడ్డి పర్యటన ఉద్రిక్తంగా మారింది. అమృత్ గ్రాండ్ హోటల్‌లో మీడియా సమావేశం అనంతరం రైల్వే గేట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడానికి వచ్చిన కవిత అకస్మాత్తుగా రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని భైఠాయించారు. కామారెడ్డిలో ప్రకటించిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అరగంటకు పైగా ట్రాక్‌పై భైఠాయించి నిరసన తెలిపారు. రైలు వచ్చే సమయం అయిందని ధర్నా విరమించాలని పోలీసులు విజ్ఞప్తి చేసినా కవిత ససేమిరా అన్నారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి రైల్వేట్రాక్ వద్దకు చేరుకుని సముదాయించారు. అయినా భీష్మించుకుని కూర్చోవడంతో పోలీసులు భారీగా చేరుకుని కవితను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. దీంతో జాగృతి కార్యకర్తలు పోలీసులను అడ్డుకున్నారు. అరగంట పాటు ట్రాక్‌పై ఉద్రిక్తత చోటు చేసుకుంది. అయితే భారీ బందోబస్తు మధ్య కవితను అరెస్ట్ చేసి వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని బీజేపీ ఎంపీలు రాజీనామా చేసి బీసీ బిల్లు అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రైల్ రోకో చేస్తున్న కవితను పోలీసులు అరెస్ట్ చేస్తున్న క్రమంతో ఆమె కుడిచేతికి గాయమైంది. ఓవైపు కార్యకర్తలు మరోవైపు పోలీసుల పెనుగులాటలో కవిత చేతికి దెబ్బతగిలింది. పోలీసులు అలాగే ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



## ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రతిఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి సూచించారు.. నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఓటు అనేది హక్కే కాదు.. బాధ్యత కూడా అని వివరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా పోలీస్‌శాఖ నుంచి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగివంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విద్యను కార్పొరేట్‌గా మార్చిన ప్రభుత్వాలు




**అక్షరటుడే, ఆర్మూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు దేశంలో విద్యను కార్పొరేట్‌గా మార్చాయని ప్రగతి శీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య అన్నారు. నిజామాబాద్ జిల్లా మహాసభలు శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఆర్మూర్ పట్టణంలోని హనుమాన్ ఆలయం నుంచి సీవీఆర్ జూనియర్ కళాశాల వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్వేచ్ఛ, చదువుకునే హక్కు ప్రతి ఒక్కరికి కల్పించిందన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుక్రవారం ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ రుగ్మతలు ఉన్న విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వ హించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. పాఠశాలల్లో వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యతను పరిశీలించారు. అదనంగా, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరోగ్య విద్య అందించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఠాగూర్, సబ్ యూనిట్ అధికారి గోవింద్ రెడ్డి, పర్యవేక్షణ అధికారి జనార్ధన్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు సంతోష్ ఇందిర, ఆరోగ్య కార్యకర్త, సబిత లావణ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదాం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుదామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు అన్నారు. కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఏలే మల్లికార్జున్ తొలిసారి నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పిట్లంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో బాధ్యత అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌లో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతు దారులను గెలిపించుకుందామన్నారు.

## పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

**అక్షరటుడే,బాల్కొండ:** మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తూ డ్యూటీలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్నాడనే సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లగా అక్కడ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన కందరపు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయస్థానం విజయ్‌కి ఐదురోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు న్యాయమూర్తి తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి ఏడురోజుల జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి ఆటో నడిపిన కేసులో ఒకరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీతారాంనగర్‌కు చెందిన కిరణ్ మద్యం తాగి ఆటో నడుపుతున్నట్లుగా గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట అతడిని హాజరుపర్చగా విచారించిన న్యాయమూర్తి ఏడురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.



భీమ్‌గల్ కస్తూర్బా బాలికల విద్యాలయం

# కస్తూర్బాల్లో కష్టాలు

**కస్తూర్బా విద్యాలయాలు సమస్యలకు నిలయంగా మారాయి. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికలకు విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కేజీబీవీలను పట్టించుకునే వారు కరువయ్యారు. జిల్లాలోని రుద్రూరు, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా, మోపాల్ కేజీబీవీలకు సొంత భవనాలు లేవు. ఆర్మూర్, నందిపేట్, భీమ్‌గల్ కేజీబీవీల్లో సమస్యలు విలాయతాండవం చేస్తున్నాయి.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న విద్యాలయాలు
- పలు పాఠశాలల్లో సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఎంతో మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. అయితే వసతులు లేకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మోపాల్‌లో కేజీబీవీ ఉంది. బియ్యంలో పురుగులు వస్తున్నాయని, కూరగాయలు నాసిరకంగా సరఫరా చేస్తున్నారని.. కాంట్రాక్టర్ మెనూ ప్రకారం సరుకులు సరఫరా చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అలాగే ధర్పల్లి కేజీబీవీలో విద్యుత్ సౌకర్యం సరిగా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. జక్రాన్‌పల్లి పాఠశాలలో డెస్క్ బెంచీలు లేవు. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి శివారులో కేజీవీవీ ఉంది. ఇది అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉంది. ప్రహరీ లేకపోవడంతో వన్యప్రాణులు, కోతులు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

### ఆర్మూర్ నియోజకవర్గంలో..

ఆర్మూర్ పరిధిలో ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్ మండలాల్లో కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీల ఆవరణలు మురికి కూపాలను తలపిస్తున్నాయి. విద్యాలయాల ప్రాంగణాలు మురుగునీరు నిలవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. విష సర్పాలు సైతం సంచరిస్తున్నాయి. విద్యార్థులు నిత్యం అనారోగ్యం బారిన పడుతున్నారు.

### బాల్కొండ నియోజకవర్గంలో..

బాల్కొండ నియోజకవర్గంలో భీమ్‌గల్, వేల్పూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్లలో కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. భీమ్‌గల్ పాఠశాలలోని మురుగు నీరు బడి ఆవరణలో నుంచి పారుతోంది. దీంతో దుర్వాసనతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో ఎలుకల బెడద ఉంది. గతంలో పలువురిని ఎలుకలు కరిచాయి. బోధన్ మండలంలోని అమ్దాపూర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు పలుచోట్ల నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి.

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం కేజీబీవీలు : | 34 |
| ఇంటర్ విద్యను అందిస్తున్నవి: | 09 |
| విద్యార్థులు : | 6,732 |
| ఉపాధ్యాయులు: | 345 |
| బోధనేతర సిబ్బంది: | 362 |



విద్యాలయం ఎదురుగా రోడ్డుపై పారుతున్న మురికినీరు

### పనులు చేపడుతున్నాం

ఇటీవల మంజూరైన నిధులతో కస్తూర్బా విద్యాలయాల అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రధాన సమస్యలను పరిష్కరించుకుంటున్నాం. పలు భవనాలకు ఇప్పటికీ ప్రహరీలు లేవు. ఒక్కొక్కటిగా పనులు చేసుకుంటు విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చలి కాలంలో ఇబ్బందులు కలుగకుండా కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయించాం.

**– భాగ్యలక్ష్మి, జీసీడీవో, నిజామాబాద్**

## 'డబుల్' ఇళ్ల కేటాయింపు ప్రక్రియ వాయిదా

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో లాటరీ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ వాయిదా పడింది. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. అనివార్య కారణాల వల్ల డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ వాయిదా పడిందని.. త్వరలోనే కొత్త తేదీలను ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు.


## మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

**అక్షరటుడే, కోటగిరి:** అనారోగ్యం కారణంగా మనస్తాపంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పోతంగల్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. హంగర్గకు చెందిన లక్ష్మి (38) భర్తకు మద్యానికి బానిసై పనిచేయకుండా తిరిగేవాడు. అయితే సదరు మహిళ అనారోగ్యానికి గురైంది. అంతేకాకుండా కుటుంబ పోషణ సైతం భారం కావడంతో మనస్తాపానికి లోనైంది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పింఛన్ కోసం వృద్ధుల నిరీక్షణ



**అక్షరటుడే, బాన్సువాడ:** పింఛన్ కోసం వృద్ధులు రోజూ పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామంలోని వృద్ధులు వారం రోజులుగా పోస్ట్ ఆఫీస్ వద్దకు వచ్చి వెళ్తున్నా డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇతర గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జరుగుతుండగా తమ గ్రామంలో ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. తమ పింఛన్ ఇంకా ఖాతాల్లో జమ కాలేదని పోస్ట్‌మాస్టర్ చెప్పడంపై వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ ఎప్పుడు అందుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పింఛన్ పంపిణీపై అధికారులు త్వరగా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.



## ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ :** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. సరైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లవద్దని సూచించారు.. ఆధారాలు చూపలేని నగదును సీజ్ చేస్తామని వారు హెచ్చరించారు. ఒక వ్యక్తి రోజుకు రూ.50వేలు మాత్రమే తీసుకెళ్లే అవకాశం ఉందని వారు స్పష్టం చేశారు.






**కిక్కిరిసిన మీసేవ సెంటర్లు**

**స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థులు ఎన్నికల్లో పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సర్టిఫికెట్లను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం 'మీసేవ'లకు క్యూ కడుతున్నారు.** – అక్షరటుడే, గాంధారి

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పాల్వంచ విద్యార్థులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్రస్థాయి 43వ జూనియర్ ఖోఖో పోటీలకు పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ మహ్మద్ అతిఖుల్లా పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వివరాలు వెల్లడించారు. పాఠశాలలోని విద్యార్థులు దుర్గాలక్ష్మి, పవిత్ర, వర్ధిని, అస్మిత, దినేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని మైథిలి మైదానంలో ఈనెల 28 నుంచి 30 వరకు ఈ పోటీలు జరుగనున్నాయని స్పష్టం చేశారు.




## వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

**అక్షరటుడే,ముప్కాల్:** వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో రవికుమార్ మాట్లాడుతూ జంక్ ఫుడ్ ఆరోగ్యానికి హానికారకమన్నారు. ఇంట్లో అమ్మ చేసిన వంటకాలు తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని ఆయన వివరించారు. ఎంఈవో జక్కుల రవికుమార్, ముప్కాల్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గంగారాం, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాకేష్, సభ్యులు, సాయి శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెల్‌నెస్ హాస్పిటల్‌లో నెఫ్రెక్టమీ శస్త్రచికిత్స




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని వెల్‌నెస్ హాస్పిటల్‌లో నెఫ్రెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి యూరాలజీ వైద్యుడు ఎలసారి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధారికి చెందిన 60 ఏళ్ల మద్దెల కాశయ్య పదిరోజుల క్రితం తమ ఆస్పత్రికి రాగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కిడ్నీలో కొంతవరకు క్యాన్సర్ గడ్డ ఏర్పడిందని గుర్తించామన్నారు. దీంతో పూర్తిగా కిడ్నీని తొలగించకుండా ఎక్కడైతే క్యాన్సర్ గడ్డ ఏర్పడిందో ఆ భాగాన్ని తొలగించి ఆయన ప్రాణాలను కాపాడామని తెలిపారు. ప్రస్తుతం శస్త్రచికిత్స తర్వాత సగం కిడ్నీతో కాశయ్య ఆరోగ్యంగా ఉన్నాడని ఆయన వివరించారు. సమావేశంలో ఆస్పత్రి ప్రతినిధి బోదు అశోక్ కుమార్ ఆపరేషన్ హెడ్ హరికృష్ణ గౌడ్, వెల్‌నెస్ ఆస్పత్రి మేనేజర్ సతీశ్, కాశయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, బోధన్:** రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన జానకంపేట్ నుంచి నవీపేట్ వెళ్లే దారిలో చోటు చేసుకుంది. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపిన వివరాల ప్రకారం.. జానకంపేట్ నుంచి నవీపేట్ మండలానికి వెళ్లే దారిలో రైల్వేట్రాక్ వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఎడపల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాక్ పక్కన గుంతలో పడి ఉన్న సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వ్యక్తిని బోధన్ వాసిగా ప్రాథమికంగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.